క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

కృత్తివెన్ను: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బంటుమిల్లి కోర్టు న్యాయమూర్తి ఇ. సుధాకరరావు అన్నారు. యండపల్లి సచివాలయం వద్ద గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గృహ హింస చేయరాదని చెప్పారు. చిన్నచిన్న విషయాలకు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగకుండా సమస్యలను పరిష్కరించుకుంటే సమాజంలో శాంతి నెలకొంటుందని వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



పెడన: సహాయ ఫౌండేషన్ సంస్థ ఉచిత కంప్యూటర్స్ కోర్సులు అందించాలనే లక్ష్యంతో దాతలు కంప్యూటర్లను వితరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సెయింట్ విన్సెంట్ పల్లోటి ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి ఒక కంప్యూటర్‌ను సహాయ ఫౌండేషన్ వారికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ త్వరగా కంప్యూటర్ కోర్సు తరగతులను ప్రారంభించాలని సూచించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, ప్రిన్సిపాల్ పి. రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతుకు ట్రాక్టర్ అందజేత



గూడూరు: రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలకు రూపకల్పన చేశారని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. పోలవరం రైతు భరోసా కేంద్రంలో మహిళా రైతు గుమ్మడి బాలకుమారికి రూ.2,68,000 సబ్సిడీతో మంజూరైన రూ.6,70,670 విలువ చేసే సోనాలిక ట్రాక్టర్‌ను గురువారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం రైతులకు చేయనంత మేలు సీఎం జగనన్న చేస్తున్నారని వివరించారు. పలువురు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

పెడన: మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు కుట్లు, అల్లికలు ఎంతగానో ఉపకరిస్తాయని సహాయ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మామిడి వరప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక భట్ట జ్ఞానకోటయ్య జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఉచిత కుట్లు, అల్లికలు నేర్చుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను, బహుమతులను అందజేశారు. వేస్టేజ్ మార్కెటింగ్ ప్రైవేటు సంస్థ ప్రతినిధులు పీఎన్‌పీ ఈశ్వరుడు, చెండిక హరిబాబు, ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంపటాలమ్మ సంబరాలు



చల్లపల్లి: చల్లని తల్లి గ్రామ దేవత సంపటాలమ్మ అమ్మవారి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు చల్లపల్లి నారాయణరావు నగర్‌తో పాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. భక్తులు అమ్మవారికి ఎదురేగి స్వాగతం పలికి నీరు వారబోశారు. పసుపు, కుంకుమ, హారతులు ఇచ్చి నూతన వస్త్రాలు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య రజక పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

మచిలీపట్నంటౌన్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక శారదా నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్‌నోబుల్, కార్పొరేటర్లు వెంట్రపాటి నాగేశ్వరరావు, మిరియాల బసవపూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ మెడెంపూడి అనిల్‌బాబు, మెడికల్ ఆఫీసర్ సమత, సేవా సమితి ఆధ్యాత్మిక ఇన్‌చార్జి వై. సాయిబాబు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

అవనిగడ్డ: స్థానిక ఏడో వార్డుకు చెందిన రిక్షా కార్మికుడు మద్దాల మరియదాసు ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబానికి శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు రూ.5 వేలను గురువారం అందజేశారు.

స్వగృహం సాకారమయ్యేలా

- వేగంగా గృహ నిర్మాణాలు
- పెడన నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు 8,045
- ఇప్పటికే పూర్తయినవి 1,969
- ఉగాదికి మరికొన్ని పూర్తయ్యేలా చర్యలు

పెడన: పేదవాడి సొంత ఇంటి కల త్వరలో సాకారం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ నియోజకవర్గం కావడంతో హౌసింగ్ అధికారులు చొరవ చూపి లబ్ధిదారులను చైతన్య పరుస్తున్నారు.

దీంతో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని పెడన పట్టణంతో పాటు పెడన మండలం, గూడూరు, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో వైఎస్సార్ లే అవుట్లు, సొంత స్థలాల్లో ఇప్పటి వరకు 8,267 ఇళ్లను మంజూరు చేశారు. వీటిల్లో 8,045 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా 1,969 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. కొందరు ఇప్పటికే గృహ ప్రవేశాలు చేశారు. మరికొందరు ఉగాదికి గృహ ప్రవేశాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు ఈ నెల నుంచి అదనంగా పది బస్తాల సిమెంట్‌ను ఇస్తున్నారు.





సైదమ్మ టెంపుల్ వద్ద జగనన్న లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు (ఇన్‌సెట్) మడక గ్రామంలో జగనన్న లే అవుట్‌లో పూర్తయిన ఇల్లు

నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు ఇలా..

సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న ఇళ్లు 2,936 ఉన్నాయి. వీటిల్లో 1,483 ప్లాస్టింగ్ పూర్తి చేసుకుని రెడీగా ఉన్నాయి. శ్లాబు పూర్తి చేసుకుని ప్లాస్టింగ్ చేయాల్సినవి 124, శ్లాబులు వేయాల్సినవి 271, గోడలు కట్టిన తరువాత శ్లాబులు వేయాల్సినవి 425, పునాదులు తీసేందుకు సిద్ధంగా గోతులు తవ్వినవి 624, అస్సలు ప్రారంభించనివి తొమ్మిది ఉన్నాయి. జగనన్న లే అవుట్లను పరిశీలిస్తే 116 లే అవుట్లున్నాయి. వీటిల్లో 5,331 మంజూరుకాగా 486 ప్లాస్టింగ్ పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయి. 75 శ్లాబులు పూర్తయి ప్లాస్టింగ్ చేయాల్సి ఉంది. శ్లాబులు వేయాల్సినవి 322, గోడలు కట్టి శ్లాబులు వేయాల్సినవి 1,889, గోతులు తవ్వి పునాదులు వేయాల్సినవి 3,395, అస్సలు ప్రారంభించనివి 213 ఉన్నాయి.

ఉగాదికి మరికొన్ని ఇళ్లు పూర్తి



ఉగాదికి మరికొన్ని ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం. లబ్ధిదారులకు ఇసుక, స్టీల్, సిమెంట్ బస్తాలు అందుబాటులో ఉన్నాయి. ఇల్లు కట్టుకునేందుకు ముందుకు రావడమే తరువాయి. వారికి చెందాల్సినవి విడతల వారీగా అందజేస్తున్నాం.

– ఎ. శ్రీనివాసరావు, డీఈ, గృహ నిర్మాణ శాఖ, పెడన నియోజకవర్గం

మోడల్ ఇల్లుగా నిర్మించారు



మండలంలో మొట్టమొదటిగా ఇంటి నిర్మాణం పూర్తి చేశా. దీంతో మోడల్ ఇంటిగా రూపుదిద్ది ఆదర్శంగా చూపారు. చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే గృహ ప్రవేశం చేశాం. నా భర్త శివ బలిపర్రు గ్రామంలో టైలరింగ్ షాపు నడుపుతున్నారు. మా సొంత ఇంటి కల నేరవేరింది. జగనన్న కట్టిన ఇంట్లో సంతోషంగా ఉంటున్నాం.

–మోపిదేవి లక్ష్మిశివ లబ్ధిదారు, మడక, పెడన మండలం

ప్రజలకు పాలన చేరువ చేసిన జగన్

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో ఆర్‌బీకే, సచివాలయాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు మరింత చేరువ చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెదకళ్లేపల్లిలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌తో కలిసి గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక స్థితిగతులు మారిపోతున్నాయని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.



వృద్ధురాలికి పెన్షన్ వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రైతులకు రుణాలు అందజేత

అనంతరం పెదకళ్లేపల్లిలో పీఏసీఎస్ ద్వారా రుణాలు పొందిన 14 మంది రైతులకు రూ. 87 లక్షల 90 వేల విలువగల చెక్కులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా అందజేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకులు

7వ వార్డుకు చెందిన పారిటిగడ్డ చంటి తన అనుచరులతో కలిసి గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. చంటి మాట్లాడుతూ జగనన్న పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరామని చెప్పారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్‌పర్సన్లు అరజా లక్ష్మీతులసీ, పండలనేని అన్నపూర్ణ, గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, మాజీ సర్పంచ్ అరజా వెంకట సుబ్బారావు, మాజీ ఉప సర్పంచ్ గండు సాంబశివరావు, తైలం బ్రహ్మారాజు, కొండేటి రమేష్, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీఓ పార్వతి, నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు శంకుస్థాపన

మచిలీపట్నంటౌన్: నగరాన్ని ఆనుకుని ఉన్న కరగ్రహారం లేఅవుట్‌లో 16 వేల మంది నగర వాసులకు నివేశన స్థలాలు ఇచ్చామని, వీటిలో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కరగ్రహారం లే అవుట్‌లో గృహ నిర్మాణాలకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. లే అవుట్‌లో ఎ-బ్లాక్‌లో 7వ డివిజన్‌కు చెందిన సుమారు 170 మందికి స్థలాలు ఇచ్చామన్నారు. వీరిలో నాంచారమ్మ ఇప్పటికే గృహాన్ని నిర్మించి నివాసం ఉంటోందన్నారు.

ఒంటరి మహిళగా జీవనం సాగిస్తున్న నాంచారమ్మను స్ఫూర్తిగా తీసుకుని గురువారం లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారని చెప్పారు.

ప్రభుత్వం స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, కమిషనర్ చంద్రయ్య, 7వ డివిజన్ కార్పొరేటర్ పడమట రేవతి, పలు డివిజన్ల కార్పొరేటర్లు, హౌసింగ్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని, నాయకులు, లబ్ధిదారులు

నూతన చాంబర్‌లో విధులు ప్రారంభించిన జేసీ



చాంబర్‌లో పూజలు నిర్వహిస్తున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ప్రాంగణంలో ఆధునీకీకరించిన చాంబర్‌లో జేసీ అపరాజిత సింగ్ గురువారం నుంచి విధులు ప్రారంభించారు. తొలుత జేసీ పూజలు నిర్వహించారు. అనంతరం నూతన చాంబర్ నుంచి విధులు నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన చాంబర్‌ను సత్యమేవ జయతే నామకరణతో మూడు సింహాల గుర్తుతో అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

చిలకలపూడి(మచిలీపట్నం): అన్ని రంగాల్లో మహిళలు ప్రథమస్థానంలో నిలవాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ హాల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చి పురుషులతో సమానంగా రాణిస్తున్నారని చెప్పారు. న్యాయవాద వృత్తితో పాటు న్యాయమూర్తులుగా కూడా మహిళలు ముందంజలో ఉన్నారన్నారు. న్యాయమూర్తులు ఎ. పద్మ, దేవిసాయిశ్రీవాణి, మేరీ, అరుణ, వెంకటవాహిని, దీపిక లను ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ ఆర్‌కే ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చీలి ముసలయ్య, న్యాయవాదులు వడ్డి జితేంద్ర, తిరుమాని సత్యనారాయణ, రమాదేవి, సర్వా లలితాకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

చిలకలపూడి(మచిలీపట్నం): ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోన గ్రామానికి చెందిన జంగాల ఏడుకొండలు ద్విచక్ర వాహనంపై కోన వెళుతుండగా శివగంగ మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుకొండలు కాలికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు సిఫార్సు చేశారు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఏడుకొండలు స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దేవస్థానం షాపులకు వేలం

మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో పలు షాపుల నిర్వహణకు ఆలయ ప్రాంగణంలో గురువారం వేలం పాటలు నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో పలు షాపులకు ఏడాది కాలానికి వేలం పాటలు నిర్వహించామని ఆలయ ఏసీ ఎస్‌ఎస్ చక్రధరరావు తెలిపారు. వాహనాల పార్కింగ్ రుసుం రూ. 21,51,000లు, షాపు నెంబర్-1 పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయలు, విక్రయించుకునే లైసెన్సుకు రూ.32,03,999లు, చెవి కుట్టి, చెవి పోగులు విక్రయించుకునే లైసెన్సుకు రూ. 4,50,000, నితాన్నదానానికి అరటి ఆకులు సరఫరా నిమిత్తం ఆకు రూ. 0.80 పైసల చొప్పున హెచ్చు పాటదారులు కై వసం చేసుకున్నారని ఆలయ ఏసీ వివరించారు.



వేలంపాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖాధికారులు

ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అధికారులు రామకృష్ణ, ప్రసాద్, వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ లగ్జరీ బస్సులు

అవనిగడ్డ: అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి ప్రతి నెలా పౌర్ణమి రోజు అరుణాచల గిరి ప్రదక్షిణకు సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీ రాత్రి ఎనిమిది గంటలకు బయలుదేరి 5వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి దర్శనం, మధ్యాహ్నం కాణిపాకం వరసిద్ధి వినాయకుని దర్శనం, ఆలయంలో భోజనం, సాయంత్రం సిరిపురం గోల్డెన్ టెంపుల్‌లో దర్శనం, అదే రోజు రాత్రి బయలుదేరి ఆరో తేదీ ఉదయం అరుణాచలం చేరుకుని గిరి ప్రదక్షిణ చేసుకుంటారని తెలిపారు. అదే రోజు సాయంత్రం బయలుదేరి 7వ తేదీ ఉదయం అవనిగడ్డ చేరుకుంటారని వివరించారు. టికెట్ ధర రూ.3 వేలుగా నిర్ణయించామన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

యార్లగడ్డ (చల్లపల్లి): ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలని, తద్వారా చక్కని ఆరోగ్యం పొందాలని మాస్టర్ ట్రైనర్ రామమోహనరెడ్డి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ గురువారం యార్లగడ్డలో నిర్వహించారు. రబీ పంట తరువాత భూమిని బీడుగా ఉంచకుండా 365 రోజులూ పంటలు సాగు చేసుకునే విధానంపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ ఈఓ కొండవీటి చంద్రహరీష్, నాగ మృదుల పాల్గొన్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. స్థానిక చిలకలపూడిలో నవీకరించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన సముదాయాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని పేదలందరికీ అధునాతన పరికరాలతో మంచి మందులతో వైద్యసేవలు అందించేందుకు ఎంత ఖర్చయినా వెనుకాడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. చిలకలపూడి ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పాత భవనానికి మరమ్మతులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌ను అభివృద్ధి చేశామని చెప్పారు. ఈ సెంటర్‌లో తొమ్మిది సచివాలయాల పరిధిలోని 36 వేల మంది ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు. 172 రకాల మందులు, 33 రకాల సర్జికల్స్, 63 రకాల టెస్టులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఇమ్యూనైజేషన్ అందించడంతో పాటు ప్రతి నెలా 9, 10 తేదీల్లో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకం ద్వారా గర్భిణులకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రాథమిక, అత్యవసర సేవలు, కిషోర బాలికలకు కౌన్సెలింగ్ సేవలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, డీఎంహెచ్‌ఓ జి. గీతాబాయి, వైద్యురాలు దీప్తి, పలు డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ కవితతో కలిసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న పేర్ని నాని

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్‌ఆర్టీసీ మచిలీపట్నం డిపో మేనేజర్ పి. పెద్దిరాజు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. మచిలీపట్నం నుంచి భీమవరానికి కృత్తివెన్ను, లోసరి బ్రిడ్జి మీదుగా సర్వీసు నడపాలని ప్రయాణికుడు వేమవరపు నాగేశ్వరరావు కోరాడు. ఈ సర్వీసు ఏర్పాటుకు ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు. మచిలీపట్నం నుంచి ఏలూరుకు నాన్ స్టాప్ సర్వీసును నడపాలని సర్వేశ్వరరావు కోరాడు. మచిలీపట్నం నుంచి ద్వారకా తిరుమలకు వెళ్లేందుకు ఏలూరులో దిగి ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రతి రోజూ తెల్లవారుజామున బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మచిలీపట్నం నుంచి కాశేశ్వరరావు మార్కెట్‌కు ప్రతి రెండు గంటలకు నాన్‌స్టాప్ లేదా పల్లె వెలుగు సర్వీసును ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి రోజూ ద్వారకా తిరుమలకు బస్సు సర్వీసు నడపాలని పద్మజ అనే మహిళ కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చారు.



ప్రయాణికుల సమస్యలు నోట్ చేసుకుంటున్న డీఎం పెద్దిరాజు

ముమ్మరంగా మినుము కాయ తీతలు

కోడూరు: రబీలో రెండో పంటగా సాగు చేసిన మినుము పంట చేతికి రావడంతో అన్నదాతలు కాయతీత పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని ఎగువ ప్రాంతాల్లో రైతులు కూలీలు, యంత్రాల సహాయంతో మినుము కాయ తీస్తున్నారు. ఇప్పటికే మాచవరం, వి.కొత్తపాలెం, జయపురం గ్రామాల్లో పంటను కొంతమంది రైతులు ఇళ్లకు తరలించుకుపోగా, లింగారెడ్డిపాలెం, మందపాకల, పోటుమీద, పిట్టల్లంక ప్రాంతాల్లో కాయతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది సకాలంలో కాలువ వెంట ఆరుతడికి నీరు అందడంతో పంట దిగుబడి కూడా ఆశాజనకంగా ఉందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు కూడా పంట దిగుబడి అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎగువ ప్రాంతాల్లో ఎకరానికి ఆరు నుంచి పది బస్తాల వరకు దిగుబడి వస్తుందని, గతంలో పంట పండని పొలాల్లో కూడా మూడు నుంచి ఐదు బస్తాల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.



యంత్రం సహాయంతో మినుము కాయతీత పనులు

ఉన్నత విద్య, నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): ఉన్నత విద్య, నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక పద్మావతి బీఈడీ కళాశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరు విద్యను అభ్యసించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్చి చదువుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మహిళలకు ఎటువంటి సమస్యలు వచ్చినా తమ సంస్థను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని వివరించారు. న్యాయవాది చీలి ముసలయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వీవీ శైలజ పాల్గొన్నారు.



పండ్లు, రొట్టెల పంపిణీ



నాగాయలంక (అవనిగడ్డ): మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమాన్ని అవనిగడ్డ న్యాయమూర్తి కె.విజయ కల్యాణి గురువారం సందర్శించారు. వృద్ధులను ఆప్యాయంగా పలుకరించి వారి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. వారికి పండ్లు, రొట్టెలను పంచిపెట్టారు. ఆశ్రమ నిర్వాహకులు తలశిల లీలా మనోహర్‌కు పలు సూచనలు చేశారు. అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పన వెంకట సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.